స్కెచ్

# నష్టజాతకుడు

దండమూడి బాలగంగాధరరావు

రామారావు అప్పుడే ఆఫీసునుండివచ్చి చొక్కా విడుస్తూ తమ్ముణ్ణిచూచి ఆశ్చర్యంతో "ఎంత సేపయిందిరా వచ్చి" అన్నాడు.

తమ్ముడు పేపరు చదువుతూ "అరగంటయిందన్నాయ్" అన్నాడు.

"అంతా కులాసా...? ఏమిటి విశేషాలు?"

"ఏమున్నాయ్ సంగతులు..మరచాను, సుబ్బులు చనిపోయాడు"తమ్ముడు పేపరుతప్పించి అన్నాడు.

"ఛా, నోర్మూయ్" అంటూ రామారావు అదోలాచూశాడు తమ్ముడువంక.

"నిజం; తెల్లవారుఝామునే, పాపం. పూర్ ఫెలో."

"ఆఁ! మన వెంకన్నగారి సుబ్బులేనా?"

"అవునన్నాయ్!" ఆశ్చర్యంగా చూశాడు అన్నవంక.

మతిపోయిన వాడిలా అటూ ఇటూ తిరుగుతున్నాడు రామారావు. "అంతా గమ్మత్తుగా వుందే" అంటూ "అటుమొన్న సాయంత్రమేరా, గడ్డిబండి తోలుకొచ్చాడు మార్కెట్టుకి! అసలెలా చనిపోయాడు?" ఆత్రంతో అడిగాడు తమ్ముణ్ణి.

"ఏమీలేదు, మొన్న ఎండనుబడి యింటికి వచ్చాడట. అన్నంతిననంటూనే కొద్దిగాతిని పడుకున్నాడట. రాత్రి ఒళ్లు పోట్లు ఎక్కువై వాంతులు విరోచనాలు అయి తెల్లవారేప్పటికి నీరసానికొచ్చిందట ప్రాణం. వాళ్ళబావే మంగలి రాముడుతో మందు యిప్పించాడట. డాక్టర్ని పిలవమని వూళ్లోవాళ్లు చెప్పితే "వాడిముఖం వాడికేం తెలు"సని నాటువైద్యమే వాడించాడు. రాత్రికి కొంచెం నెమ్మదించిందన్నారు. తెల్లవారుఝామునేమో ఏడుపులు వినిపించగా ఏమిటని అడిగితే చచ్చిపోయాడని చెప్పారు" గుక్కతిప్పుకోకుండా చెప్పేశాడు.

రామారావు నిర్జీవుడైనాడు. బరువుగా ఉశ్వాస నిశ్వాసాలు సాగుతున్నాయ్. మనస్సులో మరే యితర ఆలోచనా లేకుండా కళ్ళకు కట్టినట్లు 'సుబ్బులు' నిశ్చలంగా ప్రకాశిస్తున్నాడు. హృదయమంతా సంతాపాన్ని వ్యక్తపరుస్తోంది. చిన్ననాటి స్నేహితుడు మరి.

ఆలోచనల ప్రవాహాన్ని త్రోసుకుంటూ స్నానానికి పైపు దగ్గరకు వెళ్ళాడు.

* * *

తను ఐదోతరగతి చదివేంతవరకూ తనతోపాటు సుబ్బులు చెఱువుదగ్గర స్కూల్లో చదువుకునేవాడు. ఆటల్లోనూ, తగాదాల్లోను ఎప్పుడూ తన పక్షమే వుండేవాడు. అంతలో తండ్రి చనిపోవటం కారణంగా బడి మానవలసొచ్చింది సుబ్బులు.

అన్నక్రిందేవుండి పచ్చడి మెతుకులు నంజుతూ పదెకరాలు చేయగల్గాడు. మొన్న తనకు ఒంతెన ప్రక్క గడ్డిబజారులో కనిపించి చేటంత ముఖం చేసుకుని ఒదిలిపెట్టలేదు చాలాసేపు. ఒట్టి అమాయకుడు!

సుబ్బులు అమాయకత్వమల్లా చదువుకున్నవాళ్ల వద్దే! ముఖ్యంగా పట్టణవాసులు వద్దేనని చెప్పాలి. తను చదువురాని మూర్ఖుణ్ణనీ, అసమర్థుణ్ణనీ— బస్తీలో వాళ్ళంటే భక్తిగా, భయంతోవుండేవాడు.

పల్లెటూళ్లో ఎంతో గట్టిమనిషి మరి! ఊళ్ళో మాలవాళ్ళని పేడకైనా రానిచ్చే వాడుకాడు. ఎంతో జాగ్రత్తగా వుండేవాడు. ఒకళ్ళగొడవ పట్టించుకునేవాడు కాదు. ఎండిన ప్రతి తాటిమట్ట, జీబుతో సహా జాగ్రత్తచేసి వంటకు వుపయోగ పెట్టుకునేవాడు.

రోగం రొష్టూ లేక పోబట్టే, భోగాలవైపు మనస్సు మళ్ళక పోబట్టే పదెకరాలు చెయ్యగల్గాడు. మాటలా?

వెంకన్న మామ చనిపోయేనాటికి సుబ్బులు వాటా నాలుగెకరాలు. అప్పటినుంచి అన్నతోనే వుంటూ పెళ్ళి చేసుకున్నాడు. భార్య చాలా

అందమైంది. పెళ్ళైనగానే అన్నదమ్ములు విడి పోయారు.

తొలి కోడి కూసినప్పుడు లేస్తాడు. మా యేవ గలమనిషి ఇంట్లో పనంతా చూసుకుని, దొడ్డివద్దకు వెళ్తాడు. గొడ్లపని చూసుకుని పదిగంటలకు ఇంటికి జేరుకునేవాడు రొప్పుకుంటూ. పెళ్ళిచేసుకున్నా డన్నమాటేగాని, భౌతిక సుఖమన్నది అప్పుడూ, ఇప్పుడూ ఒకటే. ఇప్పుడె తక్కువేమో! పండంటి పెళ్ళాం పనిజేస్తే ఎక్కడ నలిగిపోతుందో అని పువ్వులాగా చూసుకునేవాడు గృహకృత్యాలన్నీ భార్యవొద్దని వారించినా వినేవాడు కాదు.

నాల్గుమెతుకులు నంజి నాంచేరమ్మరుగుమీద కూనిరాగాలు తీస్తూ కునికిపాట్లు పడేవాడు. అదే అతని పగటి విశ్రాంతి. మళ్ళీ పొలంబోయి, గొడ్డూ గోదా చూసుకుంటూ కాలం వెళ్ళబుచ్చేవాడు. అదే అతని కానందం. పొరుగూరు వెళ్ళడు; వెళ్ళినా క్షణం యుగంలావుండేది. "మావూరే మంచిది. ఆ నీళ్ళే బాగుంటయ్. కరకరా ఆకలి కూడా వేస్తుంది" అంటాడు ఎక్కడికన్నా వెళ్తే.

తనెప్పుడన్నా సెలవులకు వెళ్ళినప్పుడు అలా పొలంవైపు వెళితే, ఫర్లాంగుదూరంనుంచే పొలికేక పెట్టేవాడు. బస్తీ ఖింతలు చెప్పించుకుంటూ సంతోషంలో తన్మయుండైపోయేవాడు, నోరప్పగించి. వేసంగి అయితే ముంజికాయలు కోసిపెట్టేవాడు.

అటువంటివాడు రెండేళ్ళమట్టి వాళ్ళ బావ చేతిలో పడ్డాడు. బావను చూస్తే హడల పుట్టేది. బావ వాళ్ళవూరు జేరుకోటమే నిజంగా సుబ్బులుకి శనిపట్టిందని చెప్పాలి.

మొన్న శ్రావణ మాసంలో సుబ్బులుకు కూతురు పుట్టింది. బంగారు ప్రతిమ! సుబ్బులుకన్నా బావ కోటయ్యే ఎక్కువ సంబరపడ్డాడు. పసికందుని జూచి పాషాణహృదయం ప్రేమతో పొంగి పోయింది. రెండు పూటలా ఎంత పని వున్నా వచ్చి చూచిపోతూ వుండేవాడు కోటయ్య.

బావకీ సరికొత్త ప్రేమనుగూర్చి సుబ్బులుకి ఆలోచించ అశక్తి కూడా లేకపోయింది. బావ అలికిడి వింటేనే గుండె జేజారైపోయేవాడికి అనుమానించటానికి ఆస్కారం లేకపోయింది. కాని నోరూరుకుంటుదా? "ఒంటరి సుబ్బులుని జూచే జేరుకున్నాడీ వూరు.అన్నతో వున్నప్పుడొచ్చాడా అందులో, పిల్ల పుట్టింతోనే కోడలు పుట్టిందని. రోజూ కుక్కలా తిరుగుతున్నాడుగాని, ఎవ రెరగ రతడి శివరాత్రి కావిలింపూ?" అంటూ చాటు మాటున అనుకునేవారు. మరీ యీ సంవత్సరం శలవుల కెళ్ళినప్పుడల్లా వూళ్ళో యివే పుకార్లు.

నిజం మాట్లాడవలసొస్తే, కోటయ్యాది పొగు గూరైనా, తన వూరివారికి మా చెడ్డ భయం. "చెడ్డవారికి స్నేహాతు లెక్కువని" త్రాగుమోతు రకం అంతా వాడి ముఠాయే. అటువంటప్పుడు వూరు జడవక ఏంచేస్తుంది?

సామాన్యుడెవ్వడూ వాడితో ఎదిరించి మాట్లాడేవాడు కాదు, మోతుబరి రైతులు పైకి డాంబికంగా మాట్లాడినా, లోపల గుండెలు బాదుకుంటూనే వుండేవారు. వీళ్ళనిజూచి జాలితో కూడిన నవ్వు నవ్వుతూ వుండేవాడు కోటయ్య—వాడు పట్టింది బంగార మవుతోంది. సంపాదనంతా పెద్దరైతులవద్ద దాచుకునేవాడు. దాంతో వాళ్ళంతా వీడిని నమ్ముతూ గౌరవిస్తున్నారు.

అంతనమ్మకం కల్గించుకున్నాడు! బలంతోపాటు లౌక్యంకూడా వుండి వాడిలో అదే ప్రత్యేకత ఇంతకీ అదృష్టవంతుడు!

* * *

ఆలోచనల తరంగాలను ఆపుకుంటూ చివరి సారిగా ఓ నిట్టూర్పు విడిచాడు, సానుభూతితో, తమ్ముడు, రాజారావు మాటలు గుర్తొస్తున్నాయ్ "నాటు వైద్యమే నాణ్యమన్నాడట" వాడిదేం పోయింది? సుబ్బులు బ్రతికితే సరే—హాయిగా పొలంలోకి వెళ్ళకుండా, వాడిచేత చేయించుకో వచ్చు; తను పైపై పెత్తనాలు చెయ్యొచ్చు; చచ్చిపోతే మరీనయం. ఏ అడ్డావుండదు! తనూ అమూల నెక్కడో పాడుబడ్డ కొంపలో వుంటం తప్పుతుంది. చంటిపిల్ల తల్లిగనుక దానికి (సుబ్బులు భార్యకు) అండగా అంతాకలసి అక్కడే వుండొచ్చు. కొంతకాలం పెత్తనం వెలిగించొచ్చు. తర్వాత సంగతి తర్వాత...

ఇంతకూ సుబ్బులు జాతకుడనుకున్నాడు రామారావు. మరొక్కసారి గాఢంగా ఉశ్వాస నిశ్వాసలు జరిపి రెండు భాష్ప బిందువులు రాల్చాడు. వాటి అసలు వునికి హృదయాంతర గోళాలమధ్య నుంచి అని స్పష్టంగా చెప్పవచ్చు. ★